క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు అర్హతసాధించిన మోడల్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సాలూరు: స్కూల్‌గేమ్స్ అండర్-14,19 విభాగాల్లో రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీలకు సాలూరు మండలంలోని పురోహితునివలస ఆదర్శపాఠశాలకు చెందిన విద్యార్థులు అర్హత సాధించారని పాఠశాల పీడీ రవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ, అండర్-14 యోగా విభాగంలో పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రమ్య, స్టాండ్‌బైగా అనూష, అండర్-19 బాయ్స్‌అండ్ గర్ల్స్ త్రోబాల్ విభాగంలో పాఠశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న తరుణ్, తొమ్మిదవతరగతి చదువుతున్న ఈక్షిత, స్టాండ్‌బైగా అనూషలు ఎంపికయ్యారని తెలిపారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్ అంజలిదేవి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖినది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామివారికి ప్రత్యేక ముడుపుల పూజలు, అభిషేకాలు జరిగాయి. లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ప్రీతికరమైన రోజు కావడంతో దూరప్రాంతాల నుంచి మహిళా భక్తులు స్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. ఈ సందర్భంగా భక్తులు తీసుకువచ్చిన వివిధ రకాల పూలతో స్వామిని అలంకరించిన అనంతరం వారితో ప్రత్యేక పూజలు చేయించారు. దూర ప్రాంతాలనుంచి ఉపవాసాలతో వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలోనే ప్రసాదాల వితరణ చేశారు.

తూటికాడ కషాయం తయారీ



వెంగళరాయపురంలో తయారుచేస్తున్న ద్రావణం

బలిజిపేట: మండలంలోని వెంగళరాయపురం గ్రామంలో తూటికాడ కషాయం తయారీపై ఎంసీఆర్‌పీ లక్ష్మి రైతులకు అవగాహన కల్పించి కషాయం తయారు చేసి చూపించారు. దీని తయారీవిధానంలో ఒక ఎకరాకు 20లీటర్ల గోమూత్రంలో 10కిలోల తూటిఆకు వేసి బాగా మరిగించి మరుసటి రోజు వడకట్టి ఒక ట్యాంకుకు ఒక లీటర్ చొప్పున వేసి స్ప్రే చేస్తే ఎటువంటి దోమలనైనా నివారించవచ్చన్నారు. దోమ, నుడిదోమ నివారణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఇటువంటి కషాయాల వినియోగం ఎంతో మంచిదని హితవు పలికారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం విజయవంతం



గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరం

సాలూరు: మండలంలోని డెన్సరాయి, సంపంగిపాడు పంచాయతీల పరిధిలోని కురుకూటి గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ వైద్యశిబిరంలో సుమారు 385 మందికి వైద్యులు వివిధ రకాల వైద్యపరీక్షలు చేసి మందులను అందించారు. ప్రజల చెంతకు ఉచితంగా వైద్యసేవలు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రజాప్రతినిధులు, నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ భరత్‌శ్రీనివాసరావు, తదితరులు ఈ సందర్భంగా ప్రశంసించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి, వైద్యాధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు చంద్రయ్య, చిన్నమ్మి, సుబ్బారావు, ఆదయ్య, సాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా..

ఆరోగ్య సురక్ష



పార్వతీపురం టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రజారోగ్యానికి భరోసా కల్పించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అధికారులతో పాటు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వాలు ఎంత ఆర్థిక సాయం చేసినా ఆరోగ్యం విషయాల్లో చిన్న కుటుంబాలు చితికి పోతున్నాయని, అలాంటి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష చాలా మంచి కార్యక్రమన్నారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రి అంటే చాలా చులకన భావం ఉండేదని కరోనా సమయంలో ప్రభుత్వ ఆస్పత్రుల సేవలు ప్రజలకు ఎంతో బాగా ఉపయోగపడ్డాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ బి.రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలగ నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భీమవరపు కృష్ణమూర్తి, జనరల్ సెక్రెటరీ వి.గురురాజు, సర్పంచ్‌లు మడక కృష్ణవేణి, గండి శంకరరావు, ఎస్.శ్రీరాములు నాయుడు, సీనియర్ నాయకులు మడక విశ్వనాథం, ఇతర వెస్సార్‌సీపీ నాయకులు, అర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గ్రామాల్లోనే ప్రముఖ డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా ఉచితవైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని కేఎస్‌పురంలో గురువారం పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్యశిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సర్పంచ్ యు.విజయలక్ష్మి, ఎంపీటీసీ వై అరుణకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, స్టేట్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఐసీడీఎస్ ఎస్‌ఓ పూర్ణిమ, మాజీ ఎంపీపీ రత్నాకర్, బలిజిపేట జెడ్పీటీసీ, ఎంపీపీ పాల్గొన్నారు.



సీతానగరం: ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న డీఐఓ టి.జగన్మోహన్‌రావు

436 మంది ఉచితవైద్య సేవలు..

ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉపయోగ పడుతోందని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ) టి.జగన్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు కేఎస్‌పురంలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరంలో రోగులకు డాక్టర్లు అందిస్తున్న సేవలను మందులు, వైద్యపరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతానగరం ,పెదంకలాం పీహెచ్‌సీల డాక్టర్లు ఉషారాణి, రాధాకాంత్, విశాఖ నుంచి వచ్చిన డాక్టర్లతో 432 మంది రోగులకు వైద్యసేవలందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రామచంద్రరావు, పీడీడీఓ బి.కృష్ణమహేష్ రెడ్డి, ఎంపీఈఓ గొర్లి సూర్యనారాయణ, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం

నియోజకవర్గంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు నాయకత్వంలో పార్టీని బలోపేతం చేయడానికి తమవంతు కృషి చేస్తున్నామని సీతానగరం మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని కోట సీతారాంపురం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, వై అరుణకుమారి, మాజీ ఎంపీపీ కె రత్నాకర్‌తో సహా పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎంపీటీసీలు, మండల పార్టీ నియకులు, పీపీసీఎస్ చైర్మన్‌లు, సచివాలయ కన్వీనర్లు కేఎస్ పురం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యం అందించడమే సీఎం ధ్యేయం

● జెడ్పీటీసీ శ్రీనివాసరావు

మక్కువ: పేదప్రజలు ఒక్క రూపాయి కూడా వైద్యంకోసం ఖర్చుచేయకుండా, ఉచితంగా వైద్యం అందించడమే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రంగునాయుడు హాజరై, గ్రామంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను పరిశీలించి రోగులతో మాట్లాడారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషకాహారం స్టాల్‌ను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాన్ని నిర్వహించగా, మావుడి సోదరులు తిలకించి గర్భిణులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మార్కొండపుట్టిలో గర్భిణులను ఆశీర్వదిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, రంగునాయుడు

చినభోగిలిలో జీజీఎంపీ నిధులతో పనులు

సీతానగరం: మండలంలోని చినభోగిలిలో ప్రజావసరాలకు అనుగుణంగా సర్పంచ్ కె.రాధ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టామని ఇంజినీరింగ్ సహాయకుడు జయరాం తెలియజేశారు. ఈ మేరకు గురువారం చినభోగిలిలో కాలువల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చిన సమయంలో ప్రజలు సమస్యలను తెలియజేయడంతో రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలియజేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని అన్ని వీధులకు తాగునీరు సరఫరా చేసేందుకు వీలుగా రక్షిత మంచినీరు పథకం అభివృద్ధి పనులకు రూ.6లక్షలు, కాలువలు, సీసీ రోడ్డు పనులకు రూ.14 లక్షలు కేటాయించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీ జి బు జ్జి, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మనోహర్, పెదభోగిలి ఇంజినీరింగ్ సహాయకుడు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ సహాయకుడు జయరాం

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెనుగంటి రవికుమార్

పార్వతీపురంటౌన్: కుటుంబసభ్యులు ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం సుంకి గ్రామానికి చెందిన పెనుగంటి రవికుమార్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయన భార్య కుమారి, అత్తమామలు పెద్దింటి సింహాచలం, గౌరమ్మ, తోడల్లుడు, మరదలు బేత గణేష్, చందనలు రవికుమార్‌ను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి తోటపల్లి బ్రిడ్జి వద్దకు వెళ్లి గడ్డి మందు తాగేశాడు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా తన తండ్రికి తెలియపరచగా వెంటనే ఆయన వచ్చి జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.

డిజిటల్ తరగతులు వినియోగించాలి

● డీఈవో ప్రేమ్‌కుమార్

మక్కువ: ప్రభుత్వం విద్యార్థులకు డిజిటల్ తరగతుల ద్వారా బోధించేందుకు శ్రీకారం చుట్టినందున, డిజిటల్ తరగతులను వినియోగించేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని డీఈవో ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల తరగతి గదులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి డిజిటల్ బోధనపై అవగాహన కల్పించారు. శతశాతం ఫలితాలు సాధించేందుకు పక్కా ప్రణాళికలు రచించాలని సూచించారు. ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తిచేయాలని స్పష్టం చేశారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో పెంట సత్యనారాయణ, హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం



బలిజిపేట: అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రాష్ట్రంలో పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలం చిలకలపల్లిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందని, ప్రజల ఇంటిముందునే వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. శిబిరంలో 419మందికి 40 మంది వైద్యసిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఎంపీటీసీ మల్లిక, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, ఎంపీడీఓ విజయలక్ష్మి, డీటీ రత్నకుమారి, వైద్యాధికారులు కిరణ్మయి, శశిధర్, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, బలిజకార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్‌ట్యాంక్‌కు మరమ్మతులు



ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి పద్మావతి

సీతానగరం:

మండలంలోని తామరఖండి గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడానికి సర్పంచ్ వెంకటనాయుడు ఆధ్వర్యంలో ట్యాంక్ మరమ్మతులు చేపట్టనున్నట్లు పంచాయతీ కార్యదర్శి పద్మావతి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంక్‌లో చెత్త పేరుకుపోవడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండడం వల్ల తక్షణమే మరమ్మతులు చేయడంతో పాటు ట్యాంక్ క్లీనింగ్ చేసి, ట్యాప్‌ల మరమత్తులు చేయనున్నట్లు చెప్పారు. తాగునీటి సరఫరాలో జరుగుతున్న జాప్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధి పనుల క్యాలెండర్‌తో అవగాహన



వేతన దారులనుద్దేశించి మాట్లాడుతున్న ఏపీఓ భాను, జేఈ కృష్ణ

సీతానగరం:

మండలంలో జరిగిన గ్రామసభల్లో గుర్తించిన ఉపాధి పనులు ఏ నెలలో ఎన్ని చేపట్టాలి? ఎక్కడ చేయాలో? ముందుగా మేట్‌లు అవగాహన కల్పించుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈ కృష్ణ, ఏపీఓ భాను సూచించారు. ఈ మేరకు గురువారం బూర్జలో క్షేత్ర సహాయకుడు జి.రామారావు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రధాన రహదారిపై క్యాలెండర్, పనులు చేయాల్సిన అంశాలపై భౌతికంగా ముగ్గులు వేసి వేతనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూర్జ, ఆవాలవలస గ్రామాల్లో భవిష్యత్తులో చేపట్టవలసిన పనులను వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బలిజిపేట ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.గణేష్ ప్రతిభ చూపడంతో ఎంఈఓ-1 సామల సింహాచలం, ప్రధానోపాధ్యాయుడు జయప్రసాద్‌లు అభినందనలు తెలియజేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 ఫైనల్ పోటీలో పాల్గొన్న జిల్లా జట్టులో గణేష్ సభ్యుడిగా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. కడప జిల్లా మైదుకూరులో ఈనెల 7వ తేదీన జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలో పాల్గొన్న జట్టు విజేతగా నిలిచిందని, ఆ జట్టులో బలిజిపేట విద్యార్థి ఉండడం గర్వకారణమంటూ సంతోషం వెలిబుచ్చారు. భవిష్యత్‌లో గణేష్ మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రసాద్, పీఈటీ పరుశురాం, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రైతు సంఘాలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం ప్రవీణ్

బలిజిపేట: మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసుకోవాలని డీపీఎం ప్రవీణ్ తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలో రైతు మహిళా సంఘాల రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మండలంలో ఉన్న 104సంఘాలను బలోపేతం చేయడం, వాటి నిర్వహణపై సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. సన్న, చిన్నకారు రైతులు మాత్రమే వీటిని నిర్వహించుకోవాలని డీపీఎం శిక్షణలో సూచించారు. కొత్తగా సంఘాల ఏర్పాటు, ఉన్న సంఘాల నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్‌కు అవసరమైన పద్ధతులు, సంఘాల నాయకులు తీసుకోవాల్సిన బాధ్యతలు, విధులు, పుస్తకాల నిర్వహణ వంటి అంశాలపై తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్, ఏపీఎం ఉమామహేశ్వరరావు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని మరోసారి దీవించండి



పాచిపెంట: ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన ప్రజలు

● ఎంపీపీ బడ్నాన ప్రమీల

పాచిపెంట: సంక్షేమ పథకాల ద్వారా ఓవైపు, జగనన్న సురక్ష ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా మరోవైపు ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా మరోసారి దీవించాలని ఎంపీపీ బడ్నాన ప్రమీల కోరారు. ఈ మేరకు గురువారం పాచిపెంట మండలంలోని పాంచాలి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించి, ఆరోగ్య సమస్య లను దూరం చేయాలనే ప్రధాన ఉద్దేశంతోనే ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. పెద్ద పెద్ద వ్యాధులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేని వారందరికీ ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్వాడీలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించి, గర్భిణులకు శ్రీమంతం చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కలువలపల్లి పెద్దిబాబు, యచ్చం వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాల నాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్ర, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, ఎంపీటీసీ దండి ఏడుకొండలు పలువురు ఎంపీటీసీలు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పాచిపెంట: గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ప్రమీల, ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు

ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు



ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్: ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించే దిశగా రాష్ట్రప్రభుత్వం అడుగులు వేసిందని ఏపీటిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని, అందులో భాగంగా ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొ న్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



మున్సిపాలిటీలో అబివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రజారోగ్యసాంకేతిక శాఖ పర్యవేక్షక ఇంజనీర్ పిగణపతిరావు

సాలూరు: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ప్రజారోగ్య సాంకేతిక శాఖ పర్యవేక్షక ఇంజినీర్ పి.గణపతిరావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఎనిమిటి సెక్రటరీలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు వాటి ప్రగతిపై ఆరా తీశారు. అబివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతకుముందు ఆయన మున్సిపాలిటీలో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, కాకుల్లతోట వద్ద హెడ్ వాటర్‌వర్క్స్, రామాకాలనీలో పార్క్ డెవలప్‌మెంట్ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ పనులు పూర్తిచేయడానికి అదనంగా మరో సుమారు రూ.19 లక్షల 50 వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయించాలని అధికారులను ఆయన ఆదేశించారు. బుడా ఆధ్వర్యంలో రామా కాలనీలో సుమారు రూ.50 లక్షలతో పార్క్‌డెవలప్‌మెంట్ చేపట్టనున్నామని, టెండర్లు పిలిచినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డీఈఈ శ్రీరామమూర్తి, టీపీ ఫణికుమార్, ఏఈ సూరినాయుడు తదితరులు ఉన్నారు.